క్లుప్తంగా

పెద్దవంగర ఎంపీపీగా కల్పన



పెద్దవంగర: పెద్దవంగర నూతన ఎంపీపీగా బొమ్మెరబోయిన కల్పన బాధ్యతలు స్వీకరించారు. మంగళవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీటీసీల సమక్షంలో ఎంపీడీఓ వేణుమాధవ్ బాధ్యతలు అప్పగించారు. గత నెల 23న ఎంపీపీ ఈదురు రాజేశ్వరిపై అవిశ్వాస తీర్మానం నెగ్గడంతో పదవి కోల్పోయిన విషయం తెలిసిందే. కాగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గెజిట్ నోటిఫికేషన్ మేరకు ఎంపీపీ ఈదురు రాజేశ్వరిని తొలగించారు.

వీరన్న సన్నిధిలో మంత్రి పూజలు



కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత వీరభద్రస్వామిని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మంగళవారం దర్శించుకున్నారు. ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆయన పేరుతోపాటు కుటుంబసభ్యుల పేర్లపై అర్చకులు గోత్రనామార్చనలు చేశారు. భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. అర్చకులు ఆయనకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోత్ రాంచంద్రునాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, వల్లూరి కృష్ణారెడ్డి, పి.రఘువీర్ రెడ్డి, మోహన్‌రావు పాల్గొన్నారు.

బాస్కెట్‌బాల్ ఎంపికలు

మహబూబాబాద్ అర్బన్: ఈనెల 20వ తేదీన జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల బాస్కెట్ బాల్ ప్రాంగణంలో బాస్కెట్‌బాల్ జిల్లాస్థాయి జూనియర్ బాలబాలికల ఎంపికలు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ సెక్రటరీ ముల్లంగి ప్రతాప్‌రెడ్డి మంగళవారం తెలిపారు. ఈ ఎంపికల్లో పాల్గొనే క్రీడాకారులు 2016 జనవరి 1వ తేదీ తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఒరిజినల్ ధ్రువీకరణ పత్రాలు, ఆధార్, పుట్టినతేదీ సర్టిఫికెట్‌తో హాజరుకావాలన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 25 నుంచి 27 వరకు హైదరాబాద్‌లో జరిగే 8వ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.

అంబులెన్స్‌లో ప్రసవం



గూడూరు: మండలంలోని మచ్చెర్ల గ్రామానికి చెందిన గర్భిణి ఈసం రమాదేవిని మంగళవారం ప్రసవం కోసం అంబులెన్స్‌లో మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలిస్తున్నారు. ఈ క్రమంలో మార్గమధ్యలో రమాదేవికి పురిటి నొప్పులు ఎక్కువ కావడంతో అంబులెన్స్ సిబ్బంది హనుమంతు, రాజు సాధారణ ప్రసవం చేశారు. ఆమె పండంటి పాపకు జన్మనిచ్చింది. సిబ్బందిని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ భూమా నాగేందర్, మెడికల్ ఎగ్జిక్యూటివ్ బత్తిని మహేష్ అభినందించారు.

ప్రోత్సాహం కల్పిస్తాం



తొర్రూరు: ఔత్సాహిక సినీ నటులకు ప్రోత్సాహం కల్పిస్తామని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి అన్నారు. మంగళవారం డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో 'శరపంజరం' చిత్ర బృందం పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఝాన్సీరెడ్డిలను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సినిమా ఈనెల 19న విడుదల కానున్న విషయం తెలిసిందే. చిత్ర బృందాన్ని ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో చిత్ర దర్శకులు గట్టు నవీన్‌కుమార్, కెమెరా మెన్ మస్తాన్ సిరిపాటి, నటుడు మేరుగు మల్లేశంగౌడ్ పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



మరిపెడ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పంపిణీ చేసే పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ శిరీష లబ్ధిదారులకు సూచించారు. మంగళవారం మరిపెడ మండలం లచ్చతండా గ్రామ పంచాయతీ పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రంలోని స్కూల్ డే కార్యక్రమాన్ని నిర్వహించి పిల్లలకు వారి తల్లిదండ్రుల సమక్షంలో ప్రోగ్రెస్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

అభివృద్ధి కోసం బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేద్దాం

● ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్



గూడూరు: పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మురళీనాయక్

గూడూరు: బీఆర్‌ఎస్ పాలనలో మాటలు తప్ప చేతలు కనిపించలేదని, అందుకే బీఆర్‌ఎస్‌ను ఖాళీ చేసి అభివృద్ధి కోసం కలిసి రావాలని ఎమ్మెల్యే మురళీనాయక్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో మంగళవారం పార్టీ మండల అధ్యక్షుడు చిట్టి వెంకన్న యాదవ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మండలంలోని భూపతిపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు గెల్లా రాజాబాబు, కోబల్‌తండా ఎంపీటీసీ బోడ సునీత భాస్కర్ ఆధ్వర్యంలో 200 మంది బీఆర్‌ఎస్ నాయకులు రాజీనామా చేసి కాంగ్రెస్‌లో చేరారు. వారికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ మురళీనాయక్ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఎంపీ ఎన్నికల్లో అధిక మెజార్టీ బలరాంనాయక్‌ను గెలిపించుకుందామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మాధవపెద్ది రమేష్‌చందర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, బీరం శ్రీపాల్‌రెడ్డి, నరేష్‌రెడ్డి, మధుగౌడ్, వీరస్వామి, కొమ్మాలు, రమణారెడ్డి, సమ్మక్క, స్వామి, కిషన్, యాకయ్య, జోగయ్యగౌడ్ పాల్గొన్నారు.

మానవత్వం చాటుకున్న ఎమ్మెల్యే

మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రం నుంచి ముడుపుగల్లు గ్రామానికి వెళ్లే మార్గమధ్యలో ఎండ తీవ్రతకు తట్టుకోలేక కళ్లు తిరిగి ద్విచక్రవాహనంపై నుంచి ఓ వ్యక్తి కింద పడిపోయాడు. అదే సమయంలో అటువైపుగా వెళ్తున్న ఎమ్మెల్యే మురళీనాయక్ తన వాహనం దిగి అతడి వద్దకు వెళ్లి ఆరోగ్య పరిస్థితిని పరిశీలించారు. వెంటనే 108కి కాల్ చేసి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించి మానవత్వం చాటుకున్నారు.

శ్రీరామ నవమి ఏర్పాట్ల పరిశీలన

శ్రీరామ నవమి సందర్భంగా బుధవారం జరుగనున్న సీతారాముల కల్యాణ మహోత్సవ ఏర్పాట్లను జిల్లా కేంద్రంలోని గాంధీ పార్కు వద్ద మంగళవారం ఎమ్మెల్యే మురళీనాయక్ పరిశీలించారు. ఎమ్మెల్యే వెంట నిర్వాహకులు చౌడవరపు మోహన్ రావు, ఓం నారాయణ లోయ, పుప్పాల రమేశ్ బాబు, డీసీసీ అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్ చందర్ రెడ్డి, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి చుక్కల ఉదయ్ చందర్, ఘణపురపు అంజయ్య పాల్గొన్నారు.

మరోసారి ఎంపీగా అవకాశం కల్పించాలి



సమావేశంలో పాల్గొన్న ఎంపీ, ఎమ్మెల్సీలు, నాయకులు

మహబూబాబాద్: పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో బీఆర్‌ఎస్ అభ్యర్థులు గెలుపు ఖాయం అని ఎంపీ మాలోత్ కవిత ధీమా వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలో మంగళవారం పార్లమెంట్ ఎన్నికల సన్నాహక సమావేశంలో మానుకోట పార్లమెంట్ పరిధిలోని భద్రాచలం అసెంబ్లీ నియోజకవర్గం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను ఆదరించాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. మరోసారి తనకు అవకాశం కల్పించాలని అందుకోసం కార్యకర్తల సైనికునిల్లా పనిచేయాలి పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీలు సత్యవతి రాథోడ్, తాత మధు పాల్గొన్నారు. రాజ్య సభ సభ్యులుగా రెండోసారి ప్రమాణ స్వీకారం చేసి మొట్టమొదటి సారి జిల్లాకు రావడంతో వద్దిరాజు రవిచంద్రకు ఘనంగా స్వాగతం పలికారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, నాయకులు పాల్గొన్నారు.

ఐటీఐ పరీక్షలకు హాజరుకావొచ్చు

మహబూబాబాద్ అర్బన్: 2023–24 విద్యా సంవత్సరానికి ప్రభుత్వ ఐటీఐ కోర్సుల్లో ప్రైవేట్ అభ్యర్థులు ఏదేని ట్రేడ్‌లో అనుభవం ఉన్న వారు నేరుగా ఐటీఐ వార్షిక పరీక్షలకు హాజరుకావచ్చని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాధాకృష్ణ మంగళవారం తెలిపారు. ఐటీఐలో 1, 2 సంవత్సరాల కోర్సులకు ఇట్టి అవకాశం కల్పిస్తున్నట్లు, అదే విధంగా ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో పని చేస్తూ మూడు సంవత్సరాల అనుభవం కలిగిన అభ్యర్థులు పరీక్షలు రాసి సర్టిఫికెట్లు పొందేందుకు అవకాశం ఉందన్నారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 19వ తేదీ సాయంత్రం 5గంటల లోపు వరంగల్ రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో దరఖాస్తు ఫారం పూర్తి చేసి సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. పూర్తి వివరాలకు ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో సంప్రదించవచ్చన్నారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

పెద్దవంగర: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలం గొట్టిపర్తి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్లు పాల నరేష్, ఎస్కే అక్బర్ ఇసుకను అనుమతులు లేకుండా తరలిస్తున్నారు. ఈ క్రమంలో మండలంలోని బొమ్మకల్లు శివారులలో కాండ్యతండావద్ద రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. సదరు డ్రైవర్లపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

ప్రజలు పార్టీలను నిలదీయాలి



పోస్టర్‌ను విడుదల చేస్తున్న లక్ష్మీనారాయణ

మహబూబాబాద్ అర్బన్: నాణ్యమైన, ఉచిత, సమాన విద్య కోసం పార్టీలను ప్రజలు నిలదీయాలని తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని టీపీటీఎఫ్ జిల్లా కార్యాలయంలో మంగళవారం విద్యారంగ సమస్యలపై ఏర్పాటు చేసిన సమావేశానికి లక్ష్మీనారాయణ హాజరై మాట్లాడారు. రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో అన్ని పార్టీలు తమ మేనిఫెస్టోలో విద్యారంగ మౌలిక అంశాలను చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం విద్యారంగ పీపుల్స్ మేనిఫెస్టో పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సమావేశంలో టీపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మైస శ్రీనివాసులు, రాష్ట్ర కార్యదర్శి కవిత, జిల్లా అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు భాస్కర్, రమేష్, విష్ణువర్ధన్, ఉపేందర్, ఉపేందర్‌రెడ్డి, గోవర్ధన్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, కార్తిక్, మోహన్, రఫీక్, మురళి, శంకర్ పాల్గొన్నారు.

బీజేపీ, మిత్రపక్షాలను ఓడించాలి



మాట్లాడుతున్న సాధుల శ్రీనివాస్

నెహ్రూసెంటర్: గ్రామస్థాయి నుంచే బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌ల మనువాద భావజాలానికి వ్యతిరేకంగా వామపక్షాలు క్షేత్రస్థాయిలో ప్రజలను చైతన్యం చేయాల్సిన ఆవశ్యకత ఉందని వామపక్ష పార్టీల జిల్లా నాయకులు అన్నారు. జిల్లా కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో లెఫ్ట్‌పార్టీల రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈసందర్భంగా వామపక్ష పార్టీల నేతలు బి.విజయసారథి, సాదుల శ్రీనివాస్, గౌని ఐలయ్య, నందగిరి వెంకటేశ్వర్లు, గోనె కుమారస్వామి, కొత్తపల్లి రవి మాట్లాడారు. దేశ సమగ్రతకు, లౌకికవాదానికి బీజేపీ ప్రమాదకరంగా మారిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ, మిత్రపక్షాలను ఓడించడమే ప్రజల లక్ష్యం కావాలన్నారు. ఈ సమావేశంలో నాయకులు రాజు, రాజమౌళి, పెరుగు కుమార్, వెంకన్న, నవీన్, రామ్మూర్తి, సీతారాంనాయక్, మధు పాల్గొన్నారు.

రాజ్యాంగ అమలుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

మహబూబాబాద్ అర్బన్: దేశంలో ప్రజాస్వామ్య పరిరక్షణ జరగాలంటే రాజ్యాంగ అమలుతోనే సాధ్యమని సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ లక్ష్మీనారాయణ అన్నారు. జిల్లా కేంద్రంలోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం నిర్వహించిన ప్రజాస్వామ్య పరిరక్షణ–లౌకికవాదం సెమినార్‌కు హాజరై మాట్లాడారు. ప్రాథమిక హక్కులు సక్రమంగా అమలు కాకపోతే లౌకికవాదం ప్రశ్నార్థకం అవుతుందన్నారు. ఈ సమావేశంలో కరస్పాండెంట్ సత్యనారాయణ, విశ్రాంత ఉపాధ్యాయులు మైస శ్రీనివాసులు, కళాశాల ప్రిన్సిపాల్ కృష్ణప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ శంకర్, అధ్యాపకులు కృష్ణరావు, రాజు, ముత్తయ్య, ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి



సారయ్య(ఫైల్)

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామ శివారు ఓ వ్యవసాయ బావిలో ప్రమాదవశాత్తు జారి పడి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత చిర్రగోని సారయ్య(64) మృతి చెందాడు. ఎస్సై వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం.. ఇనుగుర్తి మండలం కోమటిపల్లి గ్రామానికి చెందిన చిర్రగోని సారయ్య కొంత కాలంగా కేసముద్రం మండలం అమీనాపురం గ్రామంలో భార్య పిల్లలతో కలిసి అద్దె ఇంటిలో ఉంటున్నాడు. ఈ క్రమంలో కొద్ది రోజులుగా అనారోగ్యానికి గురైన చిర్రగోని సారయ్య మతిస్థిమితం కోల్పోగా ఈనెల 14న ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. ఈ మేరకు సారయ్య అదృశ్యమయ్యాడని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. కాగా కల్వల గ్రామ శివారులోని ఓ మిల్లు పక్కన ఉన్న వ్యవసాయ బావిలో మంగళవారం ఒక మృతదేహం కనిపించింది. అదృశ్యమైన సారయ్యగా ప్రమాదవశాత్తు బావిలో పడి మృతి చెందినట్లుగా గుర్తించారు. కాగా సంఘటన స్థలానికి ఎమ్మెల్యే మురళీనాయక్, మానుకోట పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి పోరిక బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జెన్నారెడ్డి భరత్‌చందర్‌రెడ్డిలు చేరుకుని బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబాబాద్ జనరల్ ఆస్పత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మృతుడు సారయ్య గతంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడిగా, కేసముద్రం మార్కెట్ వైస్ చైర్మన్‌గా, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా పనిచేశాడు.

ఇంటింటికీ తాగునీరు సరఫరా చేయాలి

చిన్నగూడూరు: గ్రామాల్లో ఇంటింటికీ తాగునీరు సరఫరా జరిగేలా పంచాయతీ అధికారులు శ్రద్ధ చూపాలని డీపీఓ హరిప్రసాద్ అన్నారు. మండల కేంద్రంలో మంగళవారం ఆయన పర్యటించి.. పలు వీధుల్లో తాగునీటి సరఫరాపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఈఈ కృష్ణారెడ్డి, ఎంపీడీఓ రామారావు, ఎంపీఓ యాకయ్య తదితరులు ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

తాగునీటి సమస్య పరిష్కరించాలి

మహబూబాబాద్: 15వ వార్డులో నెలకొన్న తాగునీటి సమస్యను వెంటనే పరిష్కరించాలని సీపీఎం మున్సిపల్ ఫ్లోర్ లీడర్ సూర్నపు సోమయ్య డిమాండ్ చేశాడు. పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్‌కు వినతిపత్రంను అందజేశారు. నీటి సమస్య తీవ్రంగా ఉన్నందున వెంటనే ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రాజు, నగేష్, శ్రీను పాల్గొన్నారు.

హైస్కూల్‌లో పైపులు ధ్వంసం

కురవి: మండలంలోని మొద్దులగూడెం జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు తాగునీరు, ఇతర అవసరాలకు ఉపయోగపడే పైపులైన్లు, బోర్‌వెల్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈమేరకు మంగళవారం పాఠశాల ఉపాధ్యాయులు, గ్రామస్తులు ధ్వంసమైన పైపులను పరిశీలించారు. హెచ్‌ఎం సత్యనారాయణ సీరోలు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు వివరించారు.

సమస్యలను విస్మరిస్తున్న ప్రభుత్వాలు

నర్సింహులపేట: ప్రజా సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు గునిగంటి మోహన్ అన్నారు. మంగళవారం ఆయన మాట్లాడారు. బయ్యారం ఉక్కు పరిశ్రమ, గిరిజన యూనివర్సిటీ ఏర్పాటు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని విమర్శించారు.

పాఠశాల తనిఖీ

కేసముద్రం: మండలంలోని తాళ్లపూసపల్లి జెడ్పీ హైస్కూల్‌ను మంగళవారం ఎంపీడీఓ రవికుమార్ ఆకస్మికంగా సందర్శించారు. ఎన్నికలకు సంబంధించి పోలింగ్ బూత్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోట కనకయ్య, కార్యదర్శి దర్గయ్య, పీఈటీ నజీరుద్దీన్ పాల్గొన్నారు.

కనీస సౌకర్యాలు కల్పించాలి

కేసముద్రం: ఉపాధి హామీ కూలీలకు పనిచేసే స్థలంలో కనీస సౌకర్యాలు కల్పించాలని మండల కార్యదర్శి జల్లె జయరాజ్, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గోడిశాల వెంకన్న డిమాండ్ చేశారు. మంగళవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సంఘం ఆధ్వర్యంలో సమాచార అధికారి సత్యప్రకాశ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు.

ఆర్థికసాయం

కురవి: మండలంలోని రాజోలు శివారు బాలు తండాకు చెందిన భూక్య లింగయ్య కాలు విరిగి మంచానికే పరిమితం కావడంతో విజయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మాలోత్ రామారావు మంగళవారం రూ.5వేల ఆర్థికసాయం అందజేశాడు.

సర్వీస్ వైరు చోరీ

గార్ల: గార్ల పట్టణం సమీపంలోని పాకాల ఏటి వద్ద గల వైకుంఠధామంలో సోమవారం రాత్రి రూ.35,000 విలువ గల బోరు మోటార్ కేబుల్, సర్వీస్ వైరు, నల్లాలను గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి మంగళవారం తెలిపాడు. వరుస చోరీలు జరుగుతుండటంతో ప్రతీసారి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు.

25నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు

దంతాలపల్లి: ఈనెల 25 నుంచి ఓపెన్ టెన్త్, ఇంటర్ పరీక్షలు ప్రారంభం కానున్నట్లు ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్, హెచ్‌ఎం వేణుమాధవరెడ్డి మంగళవారం తెలిపారు. హాల్ టికెట్ల కోసం టెన్త్ విద్యార్థులు 94407 22908 నంబర్‌కు, ఇంటర్ హాల్ టికెట్ కోసం 99488 65685 ఫోన్ చేయాలని కోరారు.

లింగయ్యను గెలిపించాలి

నెహ్రూసెంటర్: మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థిగా ఆదివాసీ సంఘాల జేఏసీ బలపర్చిన మాజీ ఎమ్మెల్యే చందా లింగయ్యదొరను గెలిపించాలని ఆదివాసీ జేఏసీ సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. ఈనెల 23వ తేదీన భారీ ప్రదర్శన నామినేషన్ ఉంటుందని తెలిపారు.

మురళీకృష్ణను గెలిపించాలి

నెహ్రూసెంటర్: సీపీఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ పార్లమెంట్ అభ్యర్థి మోకాళ్ల మురళీకృష్ణను గెలిపించాలని పార్టీ పార్లమెంట్ ఎన్నికల కన్వీనర్ జే.సీతారామయ్య అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఎన్నికల స్టీరింగ్ కమిటీ సమావేశం మంగళవారం నిర్వహించారు. నామినేషన్ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు ఐలయ్య, శ్రీశైలం, నాగేశ్వర్‌రావు, యాకన్న, లింగయ్య పాల్గొన్నారు.

సీఆర్పీఎఫ్, పోలీసుల కవాతు

మహబూబాబాద్ రూరల్: పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మహబూబాబాద్ రూరల్ పోలీసుల ఆధ్వర్యంలో గాంధీపురం, అనంతారం గ్రామాల్లో మంగళవారం సీఆర్పీఎఫ్ సిబ్బంది కవాతు నిర్వహించారు. స్వేచ్ఛగా ఓటు హక్కును వినియోగించుకోవాలని రూరల్ ఎస్సై వి.దీపికరెడ్డి అన్నారు.

ఆయిల్‌పామ్ పంట పరిశీలన

తొర్రూరు రూరల్: గ్రామీణ ప్రాంతాలకు చెందిన రైతులు ఆయిల్‌పామ్ తోటలను సాగు చేస్తేనే ధనవంతులుగా మారుతారని తొర్రూరు హార్టికల్చర్ అధికారి రాకేష్ అన్నారు. మండలంలోని కంఠాయపాలెం గ్రామ శివారులోని రైతు, ఎంపీపీ తూర్పాటి అంజయ్య తన భూమిలో ఆయిల్‌పామ్ పంటను సాగు చేయగా, మూడేళ్ల తర్వాత తొలిసారిగా దిగుబడి వచ్చిన కాయలను పరిశీలించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ రైల్వే స్టేషన్ పరిధిలోని కిలోమీటర్ నంబర్ 439/16 రైలు పట్టాల మధ్య ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైందని డోర్నకల్ ప్రభుత్వ రైల్వే పోలీస్ ఎస్సై సురేష్ మంగళవారం తెలిపారు. మృతుడు 60 నుంచి 65 సంవత్సరాల మధ్య ఉంటాడని పేర్కొన్నాడు. రైలు పట్టాలను దాటుతున్న క్రమంలో రైలు ఢీకొట్టగా మృతిచెంది ఉండవచ్చన్నారు. మృతదేహాన్ని అన్నం సేవా ట్రస్ట్ సిబ్బంది ద్వారా ఖమ్మం ఏరియా ఆస్పత్రికి తరలించామని తెలిపారు. మహబూబాబాద్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారన్నారు. ఎవరైనా గుర్తుపడితే జీఆర్పీ ఎస్సై డోర్నకల్ 87126 58600 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

వడదెబ్బతో వృద్ధుడి మృతి



కేసముద్రం: వడదెబ్బతో ఓ వృద్ధుడి మృతి చెందాడు. ఈ ఘటన మంగళవారం మండలంలోని కల్వలలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన కుదురుపాక అబ్బయ్య(65) పశువులకు మేత నిమిత్తం ఉదయం పొలం వద్దకు వెళ్లాడు. గడ్డికోస్తున్న క్రమంలో వడదెబ్బకు గురై అక్కడే సొమ్మసిల్లి పడ్డాడు. ఈ క్రమంలో అటువైపు వెళ్లిన ఓ వ్యక్తి.. అబ్బయ్యను గమనించి కుటుంబీకులకు సమాచారం అందించాడు. దీంతో కుటుంబీకులు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని అబ్బయ్యను 108లో ఆసుపత్రికి తరలించే ప్రయత్నం చేస్తుండగా మృతి చెందాడు.

భూ కబ్జాకు యత్నించి దాడి



మహబూబాబాద్ రూరల్: మండలంలోని లక్ష్మీపురం(బి) గ్రామానికి చెందిన ఆలకుంట్ల కేతమ్మకు సంబంధించిన కొంత ఖాళీ స్థలాన్ని కొందరు వ్యక్తులు కబ్జాకు యత్నించి తనపై దాడి చేశారని బాధితురాలు కేతమ్మ మంగళవారం పేర్కొంది. తన ఇంటికి అనుకుని కొంత ఖాళీ స్థలం ఉందని, ఆ ప్రాంతంలో కంచె వేసుకుని ఇరవై ఏళ్లు అవుతుందని, తన పేరు మీద రిజిస్ట్రేషన్ కూడా అయ్యిందని తెలిపింది. ఆలకుంట్ల బాబు, ఆలకుంట్ల ఉప్పలయ్య, తుర్క యాకన్న, ఆలకుంట్ల ఎల్లేష్ మరి కొంతమంది అకారణంగా వచ్చి కంచెను తీస్తుండగా ఎందుకు అని అడుగగా.. అసభ్యకరపదజాలంతో తిట్టారని, మంత్రాలు వస్తాయని అంటూ దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేసింది. ప్రాణభయంతో 100 ఫోన్ చేసింది. మంత్రాల నెపంతో తనపై దాడిచేసి, తన ఇంటి స్థలం అక్రమంగా అక్రమించుకోవాలని చూస్తున్నారని, వారిపై చర్య తీసుకోవాలని ఆమె పోలీసులను కోరింది.

రైల్వే జంక్షన్ అభివృద్ధికి కృషి చేశా..



డోర్నకల్: కూరగాయల వ్యాపారులతో మాట్లాడుతున్న సీతారాంనాయక్

డోర్నకల్: డోర్నకల్ రైల్వే జంక్షన్‌తోపాటు మహబూబాబాద్ పార్లమెంటు పరిధిలోని రైల్వే జంక్షన్ల అభివృద్ధికి పార్లమెంట్ సభ్యుడిగా కృషి చేశానని బీజేపీ ఎంపీ అభ్యర్థి సీతారాంనాయక్ తెలిపారు. స్థానిక జైన్‌భవన్‌లో మంగళవారం బీజేపీ కార్యకర్తల సమావేశం నిర్వహించి, మెయిన్ రోడ్డు, కూరగాయల మార్కెట్‌లో స్థానికులను కలిసి తనకు ఓటేసి గెలిపించాలని అభ్యర్థించారు. డోర్నకల్‌లో కూరగాయల మార్కెట్ భవన పునర్నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు భూక్యా సంగీత, బీజేపీ మండల, పట్టణ అధ్యక్షుడు గణేష్‌నాయక్, దేవానాయక్, నాయకులు రహమాన్, జయరాజ్ పాల్గొన్నారు.

చిన్నగూడూరు: కాంగ్రెస్ ప్రభుత్వం పంటపొలాలకు నీరందించక రైతులను ఏడ్పిస్తుందని సీతారాంనాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో పార్టీ మండల అధ్యక్షుడు గుగులోత్ లక్ష్మణ్‌నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో సీతారాంనాయక్ మాట్లాడారు. అనంతరం పలువురు నాయకులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ధర్మారపు వెంకన్న, వెంకట్‌రెడ్డి, మధు పాల్గొన్నారు.

'ఎంపీ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరి పోటీ'



మాట్లాడుతున్న శివరాజ్

మహబూబాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల్లో బీఎస్పీ ఒంటరిగా పోటీ చేస్తుందని పార్టీ పార్లమెంట్ మానుకోట ఇన్‌చార్జ్ దార్ల శివరాజ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. బీఎస్పీ జాతీయ అధ్యక్షురాలు మాయావతి ఆదేశాల మేరకు దేశంలోని అన్ని రాష్ట్రంల్లో బీఎస్పీ ఏ కూటమి లేకుండా ఒంటరిగా పోటీ చేస్తుందన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు మంద ప్రభాకర్ సూచన మేరకు మహబూబాబాద్ పార్లమెంట్ స్థానంలో బీఎస్పీ అభ్యర్థిని పోటీలో నిలిపి బహుజనుల ఓట్లు అడుగుతామన్నారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు ఇసంపల్లి ఉపేందర్, జిల్లా ఇన్‌చార్జ్‌లు ఎల్.విజయ్‌కాంత్, దార ప్రసాద్‌రావు, ఉపాధ్యక్షుడు తగరం నగన్న, ప్రధాన కార్యదర్శులు శ్రీను, బుచ్చిరాములు, ఈసీ సభ్యులు చాణిక్య, హేమంత్ పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన



మహబూబాబాద్: గ్యాస్ ప్రమాదాలపై వివరిస్తున్న సిబ్బంది

మహబూబాబాద్: ప్రజలు జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలు చాలా వరకు తగ్గుతాయని ఫైర్‌స్టేషన్ ఆఫీసర్ నాగేశ్వర్‌రావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం ఆ శాఖ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని పలు అపార్ట్‌మెంట్లలో గ్యాస్ ప్రమాదాలపై సిబ్బంది అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, ప్రసన్నకుమార్, బాలు, రవి, వెంకటయ్య పాల్గొన్నారు

డోర్నకల్: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక గాంధీ సెంటర్‌లో ఫైర్‌స్టేషన్ సిబ్బంది అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పించారు. సిబ్బంది ఆర్.శ్రీనివాస్, రాజేశ్వర్ పాల్గొన్నారు.

ఇద్దరి బైండోవర్

కురవి: నల్లబెల్లం, పటిక కేసులో నిందితులుగా ఉండి పరారీలో ఉన్న కురవి మండల కేంద్రం శివారు తులిస్యా తండాకు చెందిన మూడ్ జగన్, మూడ్ బాలును అదుపులోకి తీసుకుని మంగళవారం కురవి తహసీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేసినట్లు మహబూబాబాద్ ఎక్సైజ్ సీఐ చిరంజీవి తెలిపారు. మరోమారు ఇలాంటి నేరాలు చేయకుండా ఉండేందుకు బైండోవర్ చేసినట్లు, మళ్లీ నేరం చేస్తే జరిమానా, జైలు శిక్ష విధించే అవకాశం ఉంటుందని ఆయన వివరించారు.